

# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 285 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శనివారం, 08 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 285 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SATURDAY, 08 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## కృష్ణా నీటి వాటాలను తేల్చండి



- బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఏపి

**అమరావతి,ఆగస్ట్ 06:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించేందుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ,

మిగతా2లో...

## అగ్ని-4 పరీక్ష విజయవంతం



**భువనేశ్వర్, ఆగస్ట్ 06:** భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (అగస్టు 6) వెల్లడించింది ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో

మిగతా2లో...



## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి


### బ్రేక్ ఫాస్ట్ మీట్‌లో మంత్రులకు లోకేశ్ పిలుపు

**అమరావతి, ఆగస్ట్ 06:** స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మంత్రులకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో కూటమి జయకేతనం ఎగరేసేలా

మిగతా2లో...

# రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా

● జగన్ అండ్ కోని కంట్రోల్ చేయడం 2 నిముషాల పని ● డీఎస్సీపై కావాలనే నానా యాగీ చేస్తున్నారు ● పొగాకు రైతుల వద్దకు వెళ్లి హంగామా చేశారు ● రైతన్నల పొలాలను ధ్వంసం చేసి..వారిని క్షోభ పెట్టారు ● జగన్ అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి ● కేబినేట్‌లో మంత్రులతో సిఎం చంద్రబాబు



**అమరావతి, ఆగస్ట్ 06:** జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. కానీ రాజకీయ ముసుగులో వారు నేరాలు చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై చేస్తున్న రాద్ధాంతాన్ని కూడా అందరూ గమనిస్తున్నారని తెలిపారు. అన్ని విషయాలు డీఎస్సీపై మనం ప్రజలకు వివరించామని అన్నారు. వైసీపీ నేతలు కోర్టులతో కూడా చీవాట్లు పడ్డారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మూడున్నర గంటల పాటు ఆయా అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. స్థానిక ఎన్నికలకు మంత్రులు, కూటమి నేతలు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కోర్టుల చీవాట్లు పెట్టినా వైసీపీ నేతలు యాగీ చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం ఏంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వైసీపీ నేతలకు అసలు రిజర్వేషన్ల గురించి తెలియదని విమర్శించారు. డీఎస్సీలో హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై.. అందరికీ తెలపాల్సిన బాధ్యత మంత్రులదేనని ఆదేశించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిన్న దేవరపల్లిలో పర్యటన సందర్భంగా రైతన్నల పొలాలను గొడ్డలి పార్టీ శ్రేణులు నాశనం

మిగతా2లో...

## విద్య వ్యాపార వస్తువుగా మారింది

- ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు
- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు
- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు
- ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం
- కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**ముంబై, ఆగస్ట్ 06:**కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి

మిగతా2లో...



## బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

- రూ.23,731 కోట్ల 'గోబర్ధన్ పథకం
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, అగస్ట్ 06:**ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల '

మిగతా2లో...

## జగన్ అరాచకాలతో జనం బెంబేలు

- పరామర్శల పేరుతో శాంతిభద్రతల సమస్య
- గంజాయి, తాగుబోతు బ్యాచ్‌లతో వీరంగం
- రెండున్నరేళ్లలో అనేక రకాలుగా అకృత్యాలు
- ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయినా పాశ్చాత్తాపం ఏదీ
- మీడియా సమావేశంలో మండిపడ్డ హోంమంత్రి అనిత




**అమరావతి ఆగస్ట్ 06:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారమర్శల పేరుతో రాష్ట్రంలో అరచాకం సృష్టిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి పరామర్శల పేరుతో జగన్ సృష్టించిన విధ్వంసాన్ని వివరిస్తూ మీడియాకు ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. జగన్ పర్యటనల్లో సృష్టించిన అరాచకాల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనిత

మిగతా2లో...



## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్

ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం



## విద్యార్థుల ఫీజులు డిస్‌ప్లే చేయాలి

### పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశం

పాఠశాల నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లోనూ పొందుపరచాలని స్పష్టం చేసింది.

## 15 రాష్ట్రాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు

### మొత్తం 49 మంది నిందితుల అరెస్టు



# రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా

(మొదటి పేజీ తరువాయి)

చేశాయని ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్టగొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్ర పటాలు పగలకొట్టడం ఆక్షేపణీయమని అన్నారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని ఆగ్రహించారు. అనేకమంది రైతులు తనకు మెసేజ్‌లు పంపారని తెలిపారు. తమ పంట దెబ్బతిందని అన్నదాతలు తనకు వివరించారని అన్నారు. చివరకు జగన్ పరామర్శలు అంటే జనం భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఈ నెలాఖరుకు వెలుగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీటి కోసం నీళ్లు ఇస్తామని వెల్లడించారు. ఎల్‌నినో గురించి మంత్రులు ప్రజలకు తెలపాలని సూచించారు. ఇంత వర్షాభావం ఉన్న కూడా మంచినీటికి కూడా మనం నీళ్లు ఇస్తున్నామనేది ప్రజలకు వివరించాలని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా తొలిసారి థింసా గిరిజన నృత్యానికి గిన్నిస్ రికార్డు వచ్చిందని ప్రస్తావించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఓ సెంటిమెంట్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అక్కడ ల్యాండింగ్ కూడా సముద్రం మీద నుంచి వచ్చే విధంగా ఏర్పాటు చేశామని వివరించారు. స్వర్ణాంధ్ర, వికసిత భారత్ ఈ రెండు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మంత్రుల ప్రసంగాల్లో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. క్వాంటం వ్యాలీ జనవరిలో ప్రారంభమవు తుందని ప్రకటించారు. 'దిశా' అనేది అసలు చట్టం రూపం నోచుకోలేదని సీఎం తెలిపారు. అయినా 'దిశా' పోలీస్ స్టేషన్లు, వాహనాలని చెప్పి హడావుడి చేశారని దుయ్యబట్టారు. 'దిశా' చట్టం అని పంపితే కేంద్రప్రభుత్వం తిరస్కరించి వెనక్కు పంపిందని ప్రస్తావించారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని మండిప డ్డారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లుగా మందు తాగించి ప్రజలను తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులే తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు ఆక్వా జోన్, నాన్ ఆక్వాజోన్ అనే తేడా లేకుండా రూ.1100 కోట్లు విద్యుత్ రాయితీలు ఇచ్చామని ప్రస్తావించారు. ఆక్వా ఫీడ్ ఎక్స్‌పోర్ట్ 50శాతం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. అగ్రిగోల్డ్ అంశంపై కేబినెట్‌లో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో కేబినెట్ సబ్ కమిటీ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు 11 రాష్ట్రాల్లో ఉన్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు సాధ్యమైనంతవరకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూములు వేలం వేయడంలో సరైన ధర రావాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వేలంతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలు కూడా చూడాలని కేబినెట్ సబ్ కమిటీకు సూచించారు. ఇప్పటికే 15 ఏళ్లు పూర్తి అయిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. కేబినెట్ సబ్ కమిటీ ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. 13న సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో సీఎం కాన్వాయ్ ప్రయాణించి నేరుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు వస్తుందని వెల్లడిం చారు. అక్కడ వాటి తాళాలను ముఖ్యమంత్రికి అందజే స్తారని చెప్పారు. విజయదశమి నాటికి మంత్రుల క్వా ర్టర్స్‌ను సిద్ధం చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# జగన్ అరాచకాలతో జనం బెంబేలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ... తన రాజకీయం కోసం పేదలను గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. రెండేళ్లలో జగన్ చేసిన పర్యటనలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. పరామర్శల పేరుతో విధ్వంసం, అరాచకం సృష్టిస్తు న్నారని ధ్వజమెత్తారు. జగన్ బూటకపు పరామర్శలు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. మంచి, చెడు రెండింటిని ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఈ రెండేళ్లలో రెండు వేర్వేరు నడవడిక ఉన్న నాయకులను ప్రజలు చూశారని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతు న్నారని, సీఎం కృషితోనే పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తోందని వెల్లడించారు. మరోవైపు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకం జరుగుతోందని ఆగ్రహించారు. ఆయన బయట అడుగుపెడితే మహిళలకు రక్షణ లేదని, సామాన్య ప్రజలు వ్యాపారాలు చేసుకోలేరని చెప్పుకొచ్చారు. పోలీసులను సైతం బెదిరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఏపీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏదో ఒక పరామర్శ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్తు మన బిడ్డలదని... మన చుట్టూ ఎలాంటి నాయకులు ఉన్నారో గమనించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేసే హక్కు ప్రతిపక్షానికి ఉందని చెప్పుకొచ్చారు. వైసీపీ నేతలు బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగాలని.. తాము సమాధానం చెబుతామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనినైనా ఆయన చేస్తున్నారా ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు. దిశాబిల్లు ఉపసంహరణపై హోం మంత్రి అనిత మాట్లాడారు. జగన్ హయాంలో దిశా చట్టం లేకుండానే పోలీస్ స్టేషన్లు పెట్టారని, పోలీసులకు బాధ్యతలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. పోలీసులకు ఫింగర్ ప్రింట్ అథంటికేషన్ ఎక్యూప్‌మెంట్ కూడా వైసీపీ హయాంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఎంతమంది వస్తారు, బారికేడ్లు ఎంత ఎత్తులో ఉండాలో పోలీసులే చెబుతారని అన్నారు. చట్టాలను గౌరవించేవారికి అవి వర్తిస్తాయని చెప్పారు. వారు నిబంధనలను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధ్వంసం సృష్టించాలనే ఆయన బయటకు వస్తున్నారని మండిపడ్డారు. 2019కు ముందు ఒక్క ఛాన్స్ అని చెప్పి అరాచకం సృష్టించారని ఆగ్రహించా రు. శుక్రవారం వస్తే చాలు ఎవరిని జైల్లో పెడతారో తెలియని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చెప్పుకోవడానికి ఎన్ని పేజీలైనా సరిపోవని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని జగన్ చూడలేకపోతున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎక్కడికి వచ్చినా విధ్వంసాలు, ఉద్రేకాలు సృష్టిస్తున్నారని ÷ర్ అయ్యారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించే తాము చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. జగన్ వెనుక ఉన్నది జన్‌జీలు కాదని.. గంజాయిలు అని ఎద్దేవా చేశారు. జగన్‌కు అర్హత మేరకే సెక్యూరిటీ కల్పించామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. డీఎస్సీ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కోర్టులు చెప్పాయని ప్రస్తావించారు. వైసీపీ నేతలకు మంత్రి నారా లోకేశ్ అంటే భయమని విమర్శించారు. భస్మాసురుడికి అహం తలకెక్కినట్లే జగన్ ప్రవర్తన ఉందని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చిన ప్రజల నాశనాన్ని కోరుకున్నారని ఆగ్రహించారు. భస్మాసురుడికి పట్టిన గతే గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి పడుతుందని హోం మంత్రి అనిత సెటైర్లు గుప్పించారు. విజనరీ నాయకుడు చంద్రబాబు ఏపీని అభివృద్ధి చేస్తున్నారని ఉద్ఘాటించారు. ఆయన విధ్వంసం, అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. మిర్చి రైతుల పరామర్శ పేరుతో గుంటూరు మిర్చియార్డుకు వెళ్లి రైతులను తన బౌన్సర్లతో కొట్టించారని ఆగ్రహించారు. మిర్చి టిక్కీలను ఫ్యాన్ పార్టీ నేతలు దొంగతనం చేశారని ఆరోపించారు. పరామర్శ పేరుతో బల ప్రదర్శనలు చేసి.. రైతులను కొట్టి.. దొంగతనాలు చేస్తారా..? ఇదేం తీరు.? అని ప్రశ్నించారు. గంజాయి తాగండి... మహిళలను ఏడ్పించాలని జగన్ మోహన్ రెడ్డి జనాలకు చెప్పాలను కుంటున్నారా..? అని ఎద్దేవా చేశారు. జగన్ సొంత బాబాయ్ హత్యలో ఆయన వ్యవహరించిన తీరు చూశారని తెలిపారు. తల్లిదండ్రులు యువతను గొడ్డలి పార్టీ కార్యక్రమాలకు పంపొద్దని హోం మంత్రి అనిత సూచించారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

(మొదటి పేజీ తరువాయి)

ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

# విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

## - అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 06:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు.

ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతు న్నారని ఆరోపించారు.

యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయిం చుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# కృష్ణా నీటి వాటాలను తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

# అగ్ని-4 పరీక్ష విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని-4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులంతా కష్టపడాల్సి ఉంటుందన్నారు. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో లోకేశ్ బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిన తీరును అందరికీ తెలియాలని చెప్పారు. ప్రతి ఇంటి వద్దా కనీసం 3 నిమిషాలైనా ఉండి వివరించాలంటూ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై లోకేశ్ వద్ద మంత్రులు చర్చించారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రజలకు అసెంబ్లీ వేదికగా వివరిద్దామని మంత్రి తెలిపారు. జలాశయాల్లోకి వరద రావడం కాస్త ఊరటనిచ్చే అంశమని చెప్పుకొచ్చారు. తొలి ప్రాధాన్యం తాగునీరు, ద్వితీయ ప్రాధాన్యం పశుగ్రాసానికి ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి అసెంబ్లీని వేదిక చేసుకుందామని మంత్రులకు లోకేశ్ వివరించారు.

# బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ. 8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

# ఆయుశ్‌కు కేంద్రం ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఏపీలో ఆయుశ్ అభివృద్ధికి కేంద్రం నిధులను పెంచిందని చెప్పుకొచ్చారు. ఔంఓ కింద ఏపీకి మూడేళ్లలో రూ.426 కోట్ల నిధులు విడుదల అయ్యాయని వెల్లడించారు. విజయవాడ, కాకినాడ, కడప ఆయుశ్ ఆస్పత్రుల ఆధునికీకరణ చేస్తున్నట్లు తెలిపారు. 150 ఆయుశ్ డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 126 కేంద్రాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్చినట్లు వెల్లడించారు. 90 ఆయుశ్ కేంద్రాలను ఔంఃఊ గుర్తించిందని తెలిపారు. ప్రజలకు సహజసిద్ధ నివారణా వైద్యం అందించడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి


(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# నేడు చీరాల పర్యటనకు సిఎం చంద్రబాబు

## ● నేతన్నల సేవ పథకం కింద నగదు అందచేత



**అమరావతి, ఆగస్ట్ 06:** చేనేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు అందజేయనుంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిధులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విడుదల చేయనున్నారు. రూ.179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. చీరాలలో సీఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. వేటపాలెం మండలం కొత్తపేటలో చేనేత దినోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. నేతన్న సేవలో పథకం ద్వారా చేనేతల ఖాతాలకు రూ.5 వేలు నగదు బదిలీ చేయనున్నారు. చీరాల మండలం జాండ్రపేటలో చేనేత మగ్గాలను పరిశీలించి లబ్ధిదారులతో ముఖాముఖిలో మాట్లాడనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 10:30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా కొత్తపేట బయలుదేరనున్నారు. 10:50లకు కొత్తపేటకు సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. 11:05 నుంచి 12:35 వరకు ప్రజా వేదికలో పాల్గొంటారు. ప్రజా వేదిక సభలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభిస్తారు. చేనేతల ఖాతాలకు రూ.25 వేల చొప్పున నగదు బదిలీ చేస్తారు. 1:20లకు చీరాల మండలం జాండ్రపేటలో మగ్గాలను పరిశీలించి చేనేతలతో మాట్లాడుతారు. 2:30కి చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 4.25కి కొత్తపేట నుంచి హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు ఉండవల్లి బయలుదేరి వెళ్లనున్నారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు వార్తలు
శనివారం, 08 ఆగష్టు 2026

# గుంటూరులో ఘనంగా ప్రారంభమైన బీ2ఎక్స్పో

## 160 స్టాల్స్‌తో వ్యాపార, సేవా రంగాల సమ్మేళనం

**గుంటూరు, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు-అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న బీ2 ఎక్స్పో-2026 శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. వివిధ వ్యాపార, వైద్య, విద్య, పారిశ్రామిక, సేవారంగా లకు చెందిన 160కు పైగా స్టాల్స్ ఈ ఎక్స్పోలో ఏర్పాటు చేయగా, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం రోటరీ జిల్లా గవర్నర్ వడ్లమాని రవి ఎక్స్పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ప్రారంభించి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ధృతి హాస్పిటల్ డా. హరికృష్ణ ప్రముఖ పారిశ్రామికవేత్త బి.వి.సుబ్బారావు ఐడి హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఎస్.రఘు ప్రముఖ చార్టర్డ్ అకౌం టెంట్ మరియు హెచ్‌సి అండ్ హెచ్‌ఎస్ కౌన్సిల్ అధ్యక్షులు గబ్బిట శివరాం ప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, రంగా వజ్జుల లక్ష్మీపతి, రామచంద్రరాజు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ** స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక చిన్న పట్టణాలు అభివృద్ధి చెంది నేడు స్మార్ట్ సిటీలుగా ఎదిగాయని అన్నారు. అయితే ఒక ప్పుడు ప్రముఖ నగరంగా వెలుగొందిన గుంటూరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని



పేర్కొన్నారు. గుంటూరులోని వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగాల సామర్థ్యాన్ని సమాజానికి పెద్ద ఎత్తున పరిచయం చేయడానికి బీ2 ఎక్స్పో వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని అభిప్రాయపడ్డారు. ఈ ఎక్స్పోను విజయవంతంగా నిర్వహించిన బీ2 ఎక్స్పో అధ్యక్షులు కుమ్మమూరు శ్రీధర్ బాబు, భీమ వరపు హేమంత్‌తో పాటు నిర్వహణలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు.

**అలాగే ధృతి హాస్పిటల్స్‌కు చెందిన డా.హరికృష్ణ మాట్లాడుతూ** యువతను ఒక వేదికపైకి తీసుకువచ్చి, వారి సహకారంతో ఇంత పెద్ద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించి గుంటూరు అభివృద్ధికి దో హదపడాలని ఆకాంక్షించారు. వ్యాపార, వైద్య, విద్య, సాంకే తిక, సేవా రంగాలకు చెందిన ప్రతినిధులు, పారిశ్రామిక వేత్త లు, యువ పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఎక్స్పోను సందర్శించారు. ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైన ఈ బీ2 ఎక్స్పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో నిర్వహణ కమిటీ సభ్యులు విశేష కృషి చేశారు. శ్రీధర్ బాబు, హేమంత్ సారథ్యంలో ప్రారంభమైన బి2 ఎక్స్పో




కార్యక్రమంలో రవిశంకర్, ఎ.వి. రమణమూర్తి, వీరకుమార్, బద్రి, కోటేశ్వరరావు, అన్నంరాజు వంశీ వివిధ విభాగాల కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎక్స్పోను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణలో వారి సేవలను పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

# నగరంలో పచ్చదనం..



## పార్కుల నిర్వహణ పై అధికారులతో జిఎంసి కమిషనర్ ప్రత్యేక సమావేశం

**గుంటూరు, 07 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నగరంలోని ప్రధాన రహదారుల్లోని డివైడర్లలో రోడ్డు కిరువైపులా మొక్కలను విరివిగా నాటాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో నగరంలో పచ్చదనం పెంపొందించడం, పార్కుల నిర్వహణ పై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరాన్ని గ్రీన్ గుంటూరుగా చేయడానికి నగరంలో చేపట్టిన ప్లాంటేషన్ ను జియో ట్యాగ్ చేయాలన్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ డివైడర్లలో మరియు రోడ్డు కిరువైపులా మొక్కలను నాటి గ్రీనరీని పెమ్పొందిన్చాలన్నారు. అంతేకాక నగరంలోని అన్ని పార్కులలో మొక్కలు నాటడంతో పాటు వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా వాటరింగ్ చేయాలని సూచించారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో స్థానిక ప్రజలను, కాలనీ వాసులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, అప్పుడే మొక్కల సంరక్షణ బాధ్యతాయుతంగా జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే మొక్కలు నాటే ప్రాంతాల్లో మరియు నగరంలో ఎక్కడా కూడా గ్రీన్ వేస్ట్ లేదా ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరాన్ని సుందరంగా, పచ్చదనంతో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ కిషోర్, ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఈఈ వేణు, డి.ఈ.ఈ శ్రీనివాస్, ఏడీహెచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం : జిల్లా ఎస్పీ



**గుంటూరు, 07 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమంలో శుక్రవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నుండి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు మరియు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి వినతిని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. శాఖ నిబంధనలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ శాఖ ఒక కుటుంబం. పరస్పర సహకారం, సమన్వయం, పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపేతం అవుతుంది. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు.

# ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 07 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలోని వాసవి వాసవి కన్యకాపరమేశ్వరి మండపంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నసీర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ఆలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వెంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. అన్ని ఆలయాలకు కమిటీల నియమించామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయాల్లో పూజలు, వైదిక కైంకర్యాల నిర్వహణలో రాజకీయ, అధికారుల జోక్యాన్ని తగ్గించి, అర్చకులకు స్వయం ప్రతిపత్తి



కల్పిస్తూ కూటమిప్రభుత్వం నిర్ణయంతీసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేలకుపైగా ఆలయాల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల కాలనీలు మరియు టిడ్కో నివాస ప్రాంతాలలో వేలాది భజన మందిరాల నిర్మాణాన్ని చేపడుతున్నారని తెలిపారు.

**ఉచిత వైద్య సేవలు అభినందనీయం :** పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక పాత గుంటూరులోని శ్రీ కృష్ణ కళ్యాణ మండపంలో టీడీపీ నేతలు యల్లావుల అశోక్, తిరుమలశెట్టి మోహన్ రావు సహకారంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు వాణి, పీయూష, సాయి ప్రవల్లిక, సుదీష్ణ నిరీష పేదలకు వైద్య సేవలందించారు. పరీక్షల అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం బిజేపి వ్యూహారచన

**గుంటూరు, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్థానిక సంస్థల ఎలక్షన్స్ దృష్ట్యా నగరంలో రాబోయే కార్పొరేషన్ ఎలక్షన్స్ లో బిజెపి పోటీ చేసే స్థానాల పై బీజేపీ రాష్ట్ర పార్టీ నుంచి గుంటూరు జోనల్ కమిటీ ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, వల్లూరు జయప్రకాశ్ నారాయణ విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి గుంటూరు జిల్లా కార్యాలయం వాజ్ పాయ్ భవన్లో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి నగరంలోని ముఖ్య నాయకులతో ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది.

**ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ** రాబోయే స్థానిక ఎలక్షన్స్ లో మనమందరం కలిసికట్టుగా పనిచేసి బిజెపి పోటీ చేసే స్థానాలపై మరింతగా శ్రద్ధ వహించి గెలిచే విధంగా వ్యూహరచనలు ఇప్పటి నుంచే అమలు చేసుకోవాలని తద్వారా గుంటూరు కార్పొరేషన్ లో భారతీయ జనతా పార్టీ జెండా రెపరెపలాడాలని అన్నారు.




కూటమిలో భాగంగా బిజెపి పోటీ చేసే స్థానాల కోసం భారీగా కసరత్ చేయటం జరిగింది. ఈ క్రమంలో కొంత మంది నాయకులు మాట్లాడుతూ ఈసారి గుంటూరు కార్పొరేషన్ లో ఎక్కువ సీట్లలో పోటీచేసే విధంగా నాయకులు రాష్ట్ర పార్టీకి తెలియ చేయాలని కోరడం జరిగింది.

**వల్లూరు జయప్రకాశ్ మాట్లాడుతూ** రాబోయే ఎలక్షన్స్ లో ఎట్టి పరిస్థితుల్లోనూ బిజెపి పోటీ చేసే స్థానాలు అన్ని కచ్చితంగా గెలుచుకొని తీరాల్సిందేనని దానికోసం ఏ స్థాయిలో అయినా సరేఅంగబలం విషయంలో గాని అర్థబలం విషయంలో గాని ఏమాత్రం తగ్గకుండా పనిచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జూపూడి రంగరాజు, కొత్తూరి వెంకట సుబ్బారావు, భీమినేని చంద్రశేఖర్, దర్శనపు శ్రీనివాస్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, బజరంగ్ రామకృష్ణ, మాజీ కార్పొరేటర్లు నేరెళ్ల మాధవరావు, మంత్రి సుగుణ, కూతురు శ్రావణకుమారి, నాయకులు వైవి సుబ్బారావు, నడ్డి నాగమల్లేశ్వరి, తూర్పు బిఎల్‌ఏ 1 డాక్టర్ చరక కుమార్ గౌడ్, పశ్చిమ బిఎల్‌ఏ 1 క్రిష్టిపాటి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సంతృప్త స్థాయి పెరగాలి : జిల్లా కలెక్టర్

**గుంటూరు, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రభుత్వ పథకాలు పట్ల ప్రజల సంతృప్త స్థాయి పెరగాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సానుకూల స్పందన పొందేవిధంగా ఎప్పుడూ పనిచేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని నిశితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. శాఖా పరమైన సూచీలకు అనుగుణంగా ఖచ్చితమైన, నాణ్య మైన డేటాను నమోదు చేసి, లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్మణస్వామి చిత్రపటానికి నివాళులర్పించిన జేసీ



**గుంటూరు, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి శుక్రవారం కలెక్టరేట్లో జరిగింది. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, బీసీ సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, లక్ష్మణస్వామి వర్మ రాష్ట్ర స్థాయి అగ్నికులక్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కే. మయూరి, బీసీ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రజత పతక విజేత కానిస్టేబుల్ పోతురాజును అభినందించిన ఎస్పీ



**గుంటూరు, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లా చేబ్రోలు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న డి.పోతురాజు జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో రజత పతకం సాధించారు. హైదరాబాద్లో నిర్వహించిన 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2026లో పెన్కక్ సిలట్ 110 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోతురాజును అభినందించి మెడల్ తో సత్కరించారు.

# స్కూల్ బస్సు అదుపుతప్పి బోల్తా



**జూపూడి, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** విజయవాడ జాతీయ రహదారిపై జూపూడి గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం ఓ పాఠశాల బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసుల కథనం ప్రకారం కేతనకొండలోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకుని ఇబ్రహీంపట్నం వస్తోంది. మార్గమధ్యలో జూపూడి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వెంటనే స్పందించిన స్థానికులు బస్సులో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పాఠశాల బస్సుల నిర్వహణ, డ్రైవర్ల భద్రతా ప్రమాణాలు, వాహనాల ఫిట్ నెస్ పై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం

ఎంపీ కేశినేని శివనాథ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టిడిపి మైనార్టీ నేతలు



**ఇబ్రహీంపట్నం, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యం లభిస్తుందని, మైనార్టీల సంక్షేమానికి ఎంపీ కేసీనేని శివనాథ్ (చిన్ని) చేసిన కృషి ఎంతో అభినందనీయమని తెలిపారు టిడిపి నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు హైదర్. పార్లమెంట్ సమావేశాల్లో ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రూ.101.88 కోట్ల అంచనా వ్యయంతో 7 ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు తీసుకెళ్లిన పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కృతజ్ఞతలు తెలియజేస్తూ టిడిపి నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు హైదర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొండపల్లి టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలాభిషేకం అనంతరం మదర్సా పిల్లలతో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు మహబూబ్ సుభాని, కార్మిక నాయకులు షరీఫ్,పార్టీ పట్టణ అధ్యక్షులు కరిమికొండ బాలాజీ, మండల పార్టీ అధ్యక్షులు జీలాని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఏ.ఎన్.యు దూరవిద్య ఫలితాలు విడుదల

**గుంటూరు, 07 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్యూ) దూరవిద్యా కేంద్రం (సీడీఈ) ఫలితాలు విడుదలయ్యాయి. 2026 జనవరి/ఫిబ్రవరిలో నిర్వహించిన యూజీ, పీజీ అన్ని సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలను శుక్రవారం అధికారులు విడుదల చేశారు. 2 www.anucde.info వెబ్సైట్లో పరిశీలించవచ్చని సీడీఈ పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ ఉషారాణి శుక్రవారం తెలియజేశారు.

**ఫార్మా-డి, నానో టెక్నాలజీ ఫలితాలు విడుదల :** ఏ ఎన్ యు జూన్-2026లో నిర్వహించిన ఫార్మా-డి VI/VI సంవత్సరం మరియు ఏప్రిల్-2026లో నిర్వహించిన ఎమ్మెస్సీ నానో టెక్నాలజీ V/VII సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఫార్మా-డి పరీక్షల్లో 232 మందికి 228 మంది (98.28%), నానో టెక్నాలజీలో 26 మందికి 25 మంది (96.15%) ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం విడుదల చేశారు.

# పోషకాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

గుళ్ళపల్లి రజకపేటలో ముగిసిన వారోత్సవాలు





**చెరుకుపల్లి, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి రజకపేట అంగన్వాడీ కేంద్రంలో పంచాయతీ స్థాయిలో 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాల' ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎం. అనసూయ, సూపర్వైజర్ ధనలక్ష్మి, గర్భవతులు, పాలిచ్చే తల్లులు మరియు తల్లిదండ్రులకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. పసిపాప పుట్టిన గంటలోపే చనుబాలు పట్టాలని, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు తల్లిపాలతో పాటు ఇంట్లో తయారుచేసిన తాజా అనుబంధ పోషకాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. అలాగే పిల్లలకు జంక్ ఫుడ్, చక్కెర పానీయాలు ఇవ్వకూడదని, గర్భిణులు మరియు బాలింతలు మత్తుపానీయాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. శృతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ హెబ్సి రోజా ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన నాటిక (స్కిట్) తల్లిపాల ప్రాముఖ్యతను ఆకట్టుకునేలా వివరించింది. వారోత్సవాల ముగింపు సూచికగా సీడీపీవో అనసూయ చిన్నారి పేరు మీద అంగన్వాడీ సెంటర్ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ శివపార్వతి, అంగన్వాడీ వర్కర్లు నాగరాజా కుమారి, శిరీష, సక్కుబాయ్, షేహనాజ్, సుధాలక్ష్మి, జి.ఎమ్.ఎస్.కె రమాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ లో రోగుల కష్టాలకు చెక్ ఎప్పుడు !

ఎమర్జెన్సీ అని వెళ్తే బెడ్ దొరకటం కలేనా ?
నిరాశతో ఇతర ఆసుపత్రులకు వెళుతున్న రోగులు.. రిపోర్టుల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిందే
రోగుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది
జర్నలిస్టులకూ తప్పని తిప్పలు





**మంగళగిరి, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** మంగళగిరిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) లో నిపుణులైన వైద్యులతో పాటు ఆధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ పలు సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. రోగులు పెరుగుతున్న స్థాయిలో వైద్యులను, సిబ్బందిని, మెడికల్ షాప్ కౌంటర్లను, క్యాంటిన్‌లో సౌకర్యాలను పెంచలేదు. నిర్వహణ చాలా లోపభూయిష్టంగా ఉంది. ఎమర్జెన్సీ సమయంలోను బెడ్లు లేవని త్రిప్పి పంపటం రోగుల ప్రాణాలు మీదకు తెస్తోంది. లోపలికి వెళ్లడానికి, ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి, డిపార్ట్ మెంట్‌లో రిజిస్ట్రేషన్‌కు, డాక్టర్‌ని కలవడానికి, టెస్టులకు ఫీజులు చెల్లించడానికి, టెస్ట్‌లు చేయించుకోవడానికి, మందులు కొనడానికి దాదాపు ఏడెనిమిది చోట్ల క్యూలలో నిలబడాలి. అదే స్పెషలిస్ట్‌కు చూపించవలసిన అవసరం వస్తే మరోసారి క్యూలో నిలబడాలి. ఒక్కోచోట గంటసేపు కూడా ఎదురుచూడాలి. టెస్ట్‌లకు డబ్బుచెల్లించే కౌంటర్లు ఒక చోట ఉండవు. తెలియక ఒక కౌంటర్ వద్ద క్యూలో నిలబడి, దగ్గరకు వచ్చిన తర్వాత అక్కడ కాదని చెబుతారు. అప్పుడు మరో కౌంటర్ వద్ద మళ్లీ క్యూలో నిలబడాలి. రోగులను క్రమ పద్ధతిలో క్యూలో నిలపడానికి తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో రోగుల మధ్య గొడవలు, తోపులాటలు సర్వసాధారణం. ఇక్కడ ఓపీ వైద్యం పూర్తి కావడానికి ఒకపూట నుంచి రోజు పడుతుంది. అందించేది కార్పోరేట్ వైద్యం అయినా, రోగులకష్టాలు వర్ణనాతీతం. కొన్ని చోట్ల రోగులు లేక వారి బంధువులు సిబ్బంది చీత్కారాలకు గురికావలసి వస్తోంది. డాక్టర్లు అందరూ రోగుల పట్ల చాలా మర్యాదగా వ్యవహరిస్తారు. ఎంతో ఓపికతో వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతారు. అయితే, సిబ్బందిలో కొందరు మాత్రం రోగుల పట్ల చాలా దురుసుగా ప్రవర్తిస్తుంటారు. కొందరు ఎక్కువ సమయం సెల్ ఫోన్‌లో మాట్లాడుతుంటారు. రోగులను పట్టించుకోరు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు తగిన సమాచారం ఎవ్వరూ సరిగా ఇవ్వరు. దాంతో వాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సెక్యూరిటీ సిబ్బంది రోగులు, వారి బంధువుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పేరుకు మాత్రం 960బెడ్లు ఉన్నాయని, ఆస్పత్రి వైద్యాధి.కారులు గొప్పగా ప్రకటిస్తున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం రోగులు వెళితే బెడ్లు ఖాళీ లేవని, తిప్పి పంపుతున్నారు. సిఫారసు ఉంటే బెడ్ సులువుగా దొరుకుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇకచిన్నపిల్లల అత్యవసర ఐసీయూలో రాత్రివేళల్లో సిబ్బంది ఉండటంలేదని, పలువురు వాపోతున్నారు. తక్కువ ధరకు కార్పొరేట్ వైద్యంఅంటూ చేస్తున్న ప్రచారాలను నమ్మి వస్తున్న రోగులకు అనేక సందర్భాల్లో నిరాశ, తీవ్ర అసంతృప్తి ఎదురవుతు న్నాయి.

**మీడియా కు కష్టాలే!**

సామాన్య ప్రజలకే కాదు ఎయిమ్స్ వైద్యశాల వార్తలు కవరేజ్ చేసే మీడియా వారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం ఓ మీడియా ఛానల్ లో పనిచేస్తున్న పెరిక రమేష్ ప్రెస్ మీట్ కు వెళ్ళాడు. తిరిగి వచ్చే క్రమంలో వాంతులు, కడుపు నొప్పితో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఎయిమ్స్ లో వైద్యం కోసం ప్రయత్నించగా, అక్కడ స్పందన లేకపోవడంతో మంగళగిరిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఇటువంటి కారణాల వలన వేరే ఆసుపత్రులకు వెళ్లే రోగుల సంఖ్య ప్రతి రోజు ఎక్కువ గానే ఉంటుంది. లోపాలను ఎయిమ్స్ వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకునే పరిస్థితి ఏ మాత్రం కనిపించడం లేదు.

**రిపోర్టులు కోసం రోజుల తరబడి!**

బయట కేవలం గంట వ్యవధిలో వచ్చే మెడికల్ రిపోర్టులు ఎయిమ్స్ వైద్యశాలలో మాత్రం రెండు రోజుల తర్వాత వచ్చి తీసుకుని వెళ్లాలని సూచిస్తున్నారు. సీటీస్కాన్, అల్ట్రా స్కాన్, ఎమ్మారై స్కాన్, వినికిడి టెస్ట్... వంటి వాటికి నెల రోజులకు పైగా ఎదురు చూడవలసి వస్తోంది. అలాగే, భోజనశాల, క్యాంటిన్ నిర్వహణ కూడా చాలా అధ్వాన్నంగా ఉంది. భోజనశాలలో టేబుల్‌పై మంచి నీళ్ల జగ్గులు, గ్లాసులు ఉండవు. వాటర్ బాటిల్ కొనుక్కోమని ఉచిత సలహాలు ఇస్తుంటారు. ఈ విషయమై రోగులు ఆందోళన చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మెడికల్ షాపుల నిర్వహణ కూడా అధ్వాన్నంగా ఉంది. ఎయిమ్స్‌లో అతి తక్కువ ఖర్చుతో మంచి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ, నిర్వహణ పరంగా రోగులు, వారి బంధువులు అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కొందరు దిగువ స్థాయి సిబ్బంది చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎయిమ్స్ వైద్యాధికారులు ఇటువంటి సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రతి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష




**గుంటూరు, 07 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లా చీఫ్ కమిషనర్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష ఆదేశాల ప్రకారం శుక్రవారం గుంటూరు డిస్టిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఉర్దూ బాయ్స్ హైస్కూల్ నందు స్కౌట్ మాస్టర్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ ఒకరోజు అసోసియేషన్ సమావేశం మరియు బిగినర్స్ కోర్స్ నిర్వహించారని జిల్లా సెక్రెటరీ ఏం. ఏడుకొండలు తెలియజేశారు. బిగినర్స్ కోర్స్ కార్యక్రమముకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ ఫర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పి. శ్రీనివాసరావు హాజరయ్యారు. స్కౌట్ పితామహుడు బ్రెడెన్ పోల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతి పాఠశాల నుండి గతంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను యూనిఫామ్ తో శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో బి ఎస్ జి యూనిట్స్ రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ చేస్తారు. గుంటూరు జిల్లాలో 121 యూనిట్స్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించారన్నారు. **ఎస్ఓసిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ** కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాలు అనుసరించి అన్ని పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ ప్రారంభించాల్సిందిగా ఆదేశించి నందున గుంటూరు జిల్లాలోని అన్ని మేనేజ్మెంట్ స్కూల్స్ ప్రైవేటు, గవర్నమెంట్, జిల్లా పరిషత్ కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ఏపీ రెసిడెన్షియల్ అన్ని పాఠశాలలు నుండి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ రిజిస్ట్రేషన్ చేయవలసిందిగా తెలియజేశారు. ఆపదమిత్ర, మై భారత్ పోర్టల్ గురించి స్కౌట్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. **జిల్లా సెక్రెటరీ ఎమ్. ఏడుకొండలు మాట్లాడుతూ** విద్యార్థుల్లో దేశభక్తిని నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఇతరులకు సహాయం చేసే అలవాటును, సేవబావమును పెంపొందించడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం తోడ్పడుతుందన్నారు. పిల్లలకు విద్యాసంస్థలలో ఉద్యోగ అవకాశాలకు స్కౌట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మన పాఠశాలలో పిల్లల అభివృద్ధికి కొరకు సహకరించవలసిందిగా జిల్లాలోనీ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు స్కౌట్ మాస్టర్ మరియు గైడ్ కెప్టెన్ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు ఎం శ్రీహరి, గంట కిరణ్, సిహెచ్ రమేష్, తాటి నరేష్, సిహెచ్ నాగేశ్వరరావు, రజిని నాయక్, గైడ్ కెప్టెన్ కే.కామాక్షి, రజిని మరియు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం కొండంత అండ

చేనేత సొసైటీ ప్రతినిధులు హర్షం




**చెరుకుపల్లి, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన చెరుకుపల్లి లోని దివి రాంబాబు షాపు వద్ద 'నేతన్న సేవలో' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రతి చేనేత కుటుంబానికి 25,000 ఆర్థిక సహాయం అందించడం పట్ల మండలంలోని నేత కార్మికులు, చేనేత సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సహాయానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఆరంభాగ చేనేత సహకార సంఘం అధ్యక్షులు దివి రాంబాబు, పార్లమెంటరీ పార్టీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి దివి శ్రీనివాసరావు, రత్తయ్య, భవన ఋషి తదితరులతో పాటు చెరుకుపల్లి, చుట్టుపక్కల గ్రామాల నేత కార్మికులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గిరిజనులు రోడ్డుపాలు



కాంట్రాక్టు పని చేయించి.. ప్రతిఫలం ఇవ్వని గుత్తేదారు
మంత్రి కొల్లు అనుచరుడిపై ఆరోపణ
న్యాయం కోసం పాదయాత్ర..
కనకదుర్గమ్మకు ఫిర్యాదు
లంబాడీలు వినూత్న నిరసన

**ఇబ్రహీంపట్నం, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడు రాజా తమతో పనులు చేయించు కుని డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడని ఆరోపిస్తూ జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం గ్రామ బంజారా గిరిజనులు శుక్రవారం ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ కనకదుర్గ గుడికి పాదయాత్ర చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర జోక్యం చేసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని నినాదాలు చేశారు. పాదయాత్రలో దుర్గమ్మ ఫొటో, సారె ప్రదర్శించారు. సంప్రదాయ లంబాడీ దుస్తుల్లో ప్ల కార్డులు చేతపట్టి మంత్రి కొల్లు అనుచరుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతోనే అధిక దిగుబడులు









అంగ్రూ వీసీ డా. పి.వి. సత్యనారాయణ

**చెరుకుపల్లి (గుడవల్లి), 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులు, వాతావరణ మార్పులు మరియు రిజర్వాయర్లలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరిసాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ANGRAU) వైస్ ఛాన్సలర్ డా. పి.వి. సత్యనారాయణ సూచించారు. శుక్రవారం బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గుడవల్లి గ్రామంలో శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణశాఖ అంచనాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ, శాస్త్రవేత్తల సలహాల మేరకు పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాల నుండి ఆర్థిక రక్షణ పొందడానికి అర్హులైన రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) కింద నిర్ణీత గడువులోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా. డి. రామచంద్రరావు, పరిశోధనా సంచాలకులు డా. కె.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# దివంగత ప్రగడ కోటయ్యకు ఘన నివాళులు అర్పించిన వైసీపీ నాయకులు





**రేపల్లె, 07 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ . వైసీపీ నాయకులతో కలిసి పట్నంలోని పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్దగల రేపల్లె చేనేత సహకార సంఘం ప్రాంగణంలో ఉన్న చేనేత పితామహుడు దివంగత ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రేపల్లె నియోజకవర్గం ప్రజలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియ చేశారు. అనంతరం చేనేత సొసైటీ ని నాగమోహన్ కృష్ణ సందర్శించారు నేత కార్మికులను ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహ కార సంఘం మాజీ అధ్యక్షులు వైఎస్ఆర్సిపి చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టేశీ శ్రీనివాస రావు, చేనేత నాయకుడు అడిగోపుల చాముండేశ్వరి ప్రసాద్, పట్టణ వైసిపి అధ్యక్షులు కే శేషగిరి రావు, పలువురు వైసీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో ఫీజు రాక్షసత్వం



- విద్యార్థి అరవింద్ ఆత్మహత్య
- 'అమ్మ ఒడి' వచ్చాక ఇస్తామన్నా వినని కార్పొరేట్ గుండెలు!
- తీవ్రంగా అవమానించి ఇంటికి పంపిన శ్రీ చైతన్య సిబ్బంది..!
- మనస్థాపనతో మొదటి సంవత్సరం విద్యార్థి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య
- వంట పని చేసే తల్లిదండ్రుల ఆవేదన.. కుటుంబ సభ్యులతో శ్రీ చైతన్య ముట్టడి

**కాకినాడ బ్యూరో, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం ప్రదర్శించిన ఫీజుల రాక్షసత్వానికి కాకినాడలో ఒక పచ్చని ప్రాణం బలైపోయింది. "అమ్మ ఒడి రాగానే కడతాం.. కొద్దిరోజులు సమయమివ్వండి" అని వంటపని చేసే తల్లి దండ్రులు చేతులు జోడించినా ఆ కార్పొరేట్ గుండెలు కరగలేదు. తరగతి గదిలో తోటి విద్యార్థుల ముందే నిత్యం సాగిన మానసిక వేధింపులు.. ఫీజు కడితేనే కళాశాలకు రావాలని, లేకపోతే వెళ్లిపోవాలని సిబ్బంది సిసిటివి సాక్షిగా బయటకు పంపేయడం ఆ బాలుడిని తీవ్రంగా గాయపరిచాయి. తన చదువు కన్నవారికి భారంగా మారిందనే తీవ్ర మనస్తాపంతో ప్యాలా అరవింద్ (16) ఉరితాడే శరణ్యమనుకున్నాడు. ప్రభుత్వ సాయం అందేలోపే ఒక విద్యాకుసుమాన్ని బలితీసుకున్న కార్పొరేట్ దందాపై ఉమ్మడి గోదావరి జిల్లాల **ప్రత్యేక కథనం..**

కార్పొరేట్ విద్యాసంస్థ శ్రీ చైతన్య ఫీజుల రాక్షసత్వం కాకినాడలో ఒక నిరుపేద విద్యాకుసుమాన్ని దారుణంగా నలిపేసింది. హోటల్‌లో వంట పని చేస్తూ, పగలు రాత్రి చెమటోడ్చి సంపాదించే తల్లి దండ్రుల ఆశల దీపాన్ని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం ఆర్పివేసింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉన్నత భవిష్యత్తును అందుకోవాలన్న తపనతో కళాశాలలో చేరిన ప్యాలా అరవింద్ (16) అనే ప్రథమ సంవత్సరం ఎంపిసివిద్యార్థి, యాజమాన్యం పెట్టిన మానసిక క్షోభను తట్టుకోలేక తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు.

"పగలు రాత్రి కష్టపడి వంటలు చేస్తూ వేలాది మంది ఆకలి తీర్చే మా చేతులకు.. మా కొడుకు ఫీజును సమయానికి కట్టే భాగ్యం లేకుండా పోయింది సార్" అంటూ ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్న తీరు ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.

**తల్లిదండ్రుల ఆవేదన.. సీసీటీవీ సాక్ష్యం!**

రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం అది. కొడుకును పెద్ద చదువులు చదివించాలనే ఆశతో ఆ తల్లిదండ్రులు హోటల్‌లో వంటలు చేస్తూ, పొయ్యి సెగ భరిస్తూ కష్టపడి అరవింద్‌ను శ్రీ చైతన్య కళాశాలలో చేర్చారు. నిబంధనల ప్రకారం లభించాల్సిన 'అమ్మ ఒడి' ప్రభుత్వ నిధులు ఖాతాలో పడటానికి మరికొద్ది రోజులు సమయం పడుతుందని, చేతికి డబ్బులు రాగానే పైసా పైసా జమ చేసి కడతామని కాలేజీ సిబ్బందిని స్వయంగా కలిసి వేడుకున్నారు. బయటపడిన సీసీటీవీ దృశ్యాల్లో కూడా తల్లిదండ్రులు కాలేజీ ఆఫీసులో సిబ్బంది వద్ద నిలబడి, చేతులు జోడించి ప్రాధేయపడుతున్న దృశ్యాలే ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

అంతలా బ్రతిమాలినా వినని అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది. "ఇక్కడ ప్రభుత్వ పథకాల ముచ్చట్లు సాగవు.. ఫీజు కడితేనే క్లాసు, లేదంటే బయటకు వెళ్ళిపో" అంటూ అరవింద్‌పై నిరంతరం మానసిక దాడికి దిగారు. తోటి మిత్రుల ముందు జరిగిన అవమానాన్ని భరించలేక, తన చదువు తల్లిదండ్రులపై భారం కాకూడదనే తీవ్ర మనస్తాపంతో ఆ పసివాడు అర్ధాంతరంగా తనువు చాలించాడు.

**నిద్రపోతున్న ఆర్ఐఓ.. మామూళ్ల మత్తులో ఇంటర్ బోర్డు!**

ఈ ఘోర కలినికి కాకినాడ ప్రాంతీయ తనిఖీ అధికారి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**నిఘా ఎక్కడ?:** జీవోల ప్రకారం ప్రైవేట్ కాలేజీలు ఎంతఫీజు వసూలు చేస్తున్నాయో పర్యవేక్షించాల్సిన ఆర్ఐఓ, అసలు ఆఫీసు దాటి బయటకు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అక్రమ వసూళ్లపై మౌనం:** శ్రీ చైతన్య యాజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన రూ. 17,500 కంటే అదనంగా రూ ఎనభై వేల రూపాయలు దోపిడీ చేస్తున్నా ఆర్ఐఓ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

**కౌన్సెలర్లు ఏరి?:** ప్రతి కాలేజీలో విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు గుర్తింపు పొందిన కౌన్సెలర్లను నియమించాలని నిబంధనలు ఉన్నా, కాలేజీలు వాటిని తుంగలో తొక్కుతుంటే ఆర్ఐఓ ఎందుకు నోటీసులు జారీ చేయలేదు?

**శ్రీ చైతన్య ముట్టడిలో విద్యార్థి సంఘాలు**

అరవింద్ బలవన్మరణానికి కారణమైన శ్రీ చైతన్య యాజమాన్యంపై బి.ఎన్.ఎస్ సెక్షన్ 108 (ఐపిసి సెక్షన్ 306 – ఆత్మహత్యకు ప్రేరేపించడం) కింద కేసు నమోదు చేయాలని, విధి నిర్వహణలో ఘోరంగా విఫలమైన కాకినాడ ఆర్ఐఓను తక్షణమే సస్పెండ్ చేయాలని బాధితుడి కుటుంబ సభ్యులు మరియు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధితుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు, శ్రీ చైతన్య కళాశాల గుర్తింపు రద్దు చేసే వరకు పోరాటం ఆపేది లేదని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి. అయితే విద్యా సంఘాలు విద్యార్థుల వైపు నిలబడతారా కార్పొరేట్ శక్తులకు లొంగిపోతారో వేచి చూద్దాం.

# దేశంలో పైలెట్ ప్రాజెక్టు గా కాకినాడ లో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం సరఫరా

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




**కాకినాడ బ్యూరో, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దేశంలో పైలెట్ ప్రాజెక్టు గా కాకినాడ లో 50 రూపాయలు కే సామాన్య ప్రజలకు బియ్యం అందిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం కాకినాడ లో మెయిన్ రోడ్డు, రామారావు పేట లోని సూపర్ బజార్ లో బియ్యం పంపిణీ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ధరల స్థిరీకరణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఎంతో ఆలోచించి సామాన్యులు కోసం ఈ పథకం ప్రవేశ పెట్టారని తెలిపారు. రేషన్ షాపులు లో కూడా మొత్తం 67 రకాల సరుకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. వీటిలో బియ్యం, పంచదార, కంది పప్పు, పామాయిల్ తదితర సరుకులు నాణ్యత తో పాటు తక్కువ ధరకే అందిస్తామని చెప్పారు. ప్రతీ కుటుంబానికి 10 కే జీ లు చొప్పున పంపిణీ చేస్తామని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం లో లేని విధంగా 31 వేల కోట్లు క్వింటాళ్ల ధాన్యం సేకరించి,24 గంటలలో 96 శాతం మంది రైతులు కు నగదు జమ చేసి చరిత్ర సృష్టించామని చెప్పారు. ప్రజలు కోసం 14 వేల క్వింటాళ్ల బియ్యం అందుబాటులో ఉంచామని అన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ఒక్క మంత్రి కూడా కాకినాడ రాలేదని, కూటమి ప్రభుత్వం లో మంత్రి మనోహర్ అనేక సార్లు కాకినాడ వచ్చారని చెప్పారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ మానిఫెస్టో లో లేని పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వం కు దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లోరాష్ట్ర పౌర సరఫరా చైర్మన్ తోట సుధీర్, సభ్యులు కడలి ఈశ్వరి, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల బాబు, కౌడ చైర్మన్ తలాటం సత్య, సూపర్ బజార్ చైర్మన్ ప్రేసంగి ఆదినారాయణ,, జిల్లా పౌర సరఫరాల అధికారిని టి. ప్రసన్న లక్ష్మీ దేవి, మేనేజర్ ఆనందరావు, ఆర్ డి వో ఎస్. మల్లిబాబు తో పాటు పలువురు అధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు.

# హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా..!

జగ్గంపేటలో సాంఘిక సంక్షేమ హాస్టల్ నిర్మాణం చేపట్టలేదు
ఉన్న స్థలంలోనే హాస్టల్ నిర్మించాలి
: మద్రి పృధ్వీరాజు



**జగ్గంపేట, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రభుత్వం గతం నుంచి నిర్మించి హాస్టల్ నడుపుతున్న స్థలములోనే హాస్టల్ నిర్మించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ జగ్గంపేట ఇన్చార్జి మద్రి పృధ్వీరాజు డిమాండ్ చేశారు. జగ్గంపేటలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, బాయ్స్ హాస్టల్ 1982 సంవత్సరంలో స్థాపించినారు 1984 సంవత్సరంలో ప్రారంభించినారు ఎప్పటికీ 42 సంవత్సరాలు గడు స్తుంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శిధిల అవస్థలో ఉన్నటువంటి హాస్టలను ఖాళీ చేయించి రెండు సంవత్సరాలు గడు స్తుంది. హాస్టల్ ఇంటిగ్రేటెడ్ టైపులో మూడు హాస్టల్లో కలిపి నిర్మి స్తానని స్థానిక శాసనసభ్యులు హామీ ఇచ్చినారు. హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా హాస్టల్ నిర్మాణం చేపట్టలేదు. దీనికి కారణం జగ్గంపేట మెయిన్ సెంటర్లో ఎస్సీ ఎస్టీ హాస్టల్ ఉండడం ఏమిటని ఎక్కడో ఊరి చివరన చెరువులో హాస్టల్ నిర్మించడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు ఉన్నటువంటి హాస్టల్ స్థలము వాళ్ల కార్యకర్తలకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి ఎస్సీ ఎస్టీ బీసీ పిల్లలే కదా వారు ఎక్కడున్నా పరవాలేదు అనే ఉద్దేశంతోటి ఈప్రయత్నం జరుగుతుంది దానిలో భాగంగా సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి జగ్గంపేట శిథిలావస్థలో అటువంటి స్థలము మరియు హై స్కూల్ వెనుక ఉన్న స్థలము పరిశీలించి మెయిన్ రోడ్ లో ఉన్నటువంటి స్థలాన్ని రాజకీయ నాయకులకు అప్పగించడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై జై భీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు తంతాంటి కిరణ్ కుమార్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కి లిఖిత పూర్వకంగా తెలియజేయడం జరి గింది. రాష్ట్ర అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ హాస్టల్ నిర్మాణం స్థలము గనుక మారితే కోర్టు ద్వారా స్టే తేడానికి సిద్ధంగా ఉన్నామని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వ్యవహారాలు చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ అన్నారని మద్రి పృధ్వీరాజ్ తెలియజేశారు.

# చాప క్రింద నీరులా ప్రభుత్వ భూమి ఆక్రమణలు

స్టార్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభలు ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ యంత్రాంగం



**కొత్తవలస, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరంజిల్లా శృంగవరపుకోట నియోజకవర్గంలోని కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 146లో ఉన్న సుమారు 5 ఎకరాల 36 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన చెరువుని తవ్వి గడ్డ పోరంబోకు లో నుంచి రోడ్డు విషయం వెలుగులోకి వచ్చింది. ఆక్రమణదారులు 146 సర్వే నెంబర్లు 5ఎకరాలు 36 సెంట్లుని కూడా కబ్జా చేయడానికి అక్కడ ల్యాండ్ గ్లాబర్స్ ప్రభుత్వపు భూమి లో నుంచి దర్జాగా రోడ్డు వేసుకొని, ఫ్లాట్లు వేయడానికి కూడా సిద్ధమయ్యారని ఆరోపణలు రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. కొత్తవలస రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికైనా ఆక్రమణ దారుల పై చర్యలు తీసుకొని కోరుకుంటున్నారు. 146 సర్వేనెంబర్ పై అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి ఆక్రమణలను తొలగించి కల్వర్టు నిర్మాణాన్ని కూల్చివేసి రైతులకి న్యాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

# సొసైటీకి ఉత్తమ అవార్డు పై డీసీసీబీ చైర్మన్ అభినందన



**కాకినాడ బ్యూరో, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నవర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)కు ఉత్తమ సొసైటీ అవార్డు లభించడం సహకార రంగానికి దక్కిన గొప్ప గుర్తింపని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని సహకార సంఘాలు అందిస్తున్న సేవలకు ఈ అవార్డు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నవర పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సీఈఓ, గ్రామ సభ్యులు తుమ్మల రామస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి ఉత్తమ సొసైటీ అవార్డు సాధనలో సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు, సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్లు కలిసి నవర పీఏసీఎస్‌కు లభించిన ఉత్తమ సొసైటీ అవార్డును తుమ్మల రామస్వామి బాబుకు అందజేశారు.

**తుమ్మల రామస్వామి మాట్లాడుతూ** సహకార రంగ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడం, తక్కువ వడ్డీతో రుణాలు, వ్యవసాయ అవసరాలకు సకాలంలో ఆర్థిక సహాయం, ఎరువులు, విత్తనాలు వంటి సేవలను సమర్థవంతంగా అందించడంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార సంఘాల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలంలోని నవర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఉత్తమ సొసైటీగా ఎంపిక కావడం ఆ సంఘం పాలకవర్గం, అధికారులు, సిబ్బంది, సభ్యులు, రైతుల సమిష్టి కృషికి నిదర్శనమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో కూడా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆదర్శ సహకార సంఘంగా నవర పీఏసీఎస్ నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఇంచార్జ్ డీజీమ్ ఏలిశెట్టి రమేష్,నవర పీఏసీఎస్ చైర్మన్ సొసైటీకి ఉత్తమ అవార్డు పై డీసీసీబీ చైర్మన్ అభినందించారు. నవర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)కు ఉత్తమ సొసైటీ అవార్డు లభించడం సహకార రంగానికి దక్కిన గొప్ప గుర్తింపని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని సహకార సంఘాలు అందిస్తున్న సేవలకు ఈ అవార్డు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నవర పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సీఈఓ, గ్రామ సభ్యులు తుమ్మల రామస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్తమ సొసైటీ అవార్డు సాధనలో సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు, సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్లు కలిసి నవర పీఏసీఎస్‌కు లభించిన ఉత్తమ సొసైటీ అవార్డును తుమ్మల రామస్వామి బాబుకు అందజేశారు. భవిష్యత్తులో కూడా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆదర్శ సహకార సంఘంగా నవర పీఏసీఎస్ నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఇంచార్జ్ డీజీమ్ ఏలిశెట్టి రమేష్, నవర పీఏసీఎస్ చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్లు నాగనబోయినా చంటి, గున్నబత్తుల చల్లారవు, తోట నాగభూషణం,గ్రామ సభ్యు లు, రైతులు, డీసీసీబీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. తోట వెంకటేశ్వరరావు, సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్లు నాగనబోయినా చంటి, గున్నబత్తుల చల్లారవు, తోట నాగభూషణం,గ్రామ సభ్యులు, రైతులు, డీసీసీబీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం ఎలినీనో ప్రభావం నివారణ ప్రణాళిక కార్యక్రమం




**జగ్గంపేట, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 2026 సీజన్ లో నెలకొన్న ఎలినీనో పరిస్థితుల దృష్ట్యా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయశాఖ రాష్ట్రవ్యాప్తంగా రైతన్న మీ కోసం ఎలినినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక పేరుతో సమగ్ర క్షేత్రస్థాయి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం ఆగస్టు 7 నుంచి వారం రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారు. రాజనగరం మండలం నరేంద్రపురం మరియు రాజానగరం గ్రామల రైతు సేవ కేంద్రాలను నందు ఎలినీనో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అన్నరాజు కళ్యాణ్ సూర్య కుమార్ మాట్లాడుతూ ఎలినీనో ప్రభావ నివారణ కార్యాచరణ గురించి ఈ క్రింది విషయాలను వివరించడం జరిగింది.

**ప్రధాన లక్ష్యాలు**

1. ప్రతి రైతు సేవ కేంద్ర పరిధిలో ప్రతి రైతు ప్రతి వ్యవసాయ కమతం 100% సందర్శించడం
2. పంట ప్రస్తుత పరిస్థితి, నీటి కొరత వలన పంట వాడిపోవడం లేదా ఎండిపోవడం, చీడపీడల ఉధృతి, ఉద్యాన పంటలు పరిస్థితి, సాగు చేయలేని వివరాలు వంటి అంశాలను అంచనా వేయడం
3. క్షేత్ర స్థాయిలో గుర్తించిన కరువు పరిస్థితులను తగువిధంగా నివారణ చర్యలు, పంటను కాపాడుకునేందుకు తక్షణమే ఇవ్వవలసిన ప్రాణాధార నీటి తడులు మల్చింగ్ ద్వారా తేమ సంరక్షణ చర్యలు విత్తన గుళికలు ప్రతికూల వాతావరణ మార్పులను అనుగుణంగా వేసుకోవాల్సిన ప్రత్యామ్నాయ పంటలు అంతర పంటలు సాగుపంట నిర్వహణ వంటి పరిష్కార చర్యలు సూచించడం.
4. బీడుగా ఉన్న సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్యాయపంటలు వేయడం లేదా వర్షాభావ పరిస్థితి పరిణామాల వలన తీవ్రంగా దెబ్బతిన్న భూములలో మరల స్వల్ప కాలిక రకాలను విత్తుకునే విధంగా ప్రోత్సహించడం
5. కార్యక్రమం పురోగతిని ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా పారదర్శకంగా పర్యవేక్షించడం మరియు రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందజేయడం
6. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేసిన పిఎండిఎస్ క్షేత్ర సందర్శన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగేశ్వరరావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# పచ్చ కామెర్లు వ్యాధి పట్ల ఆందోళన చెందవద్దు : డిఎంహెచ్ఓ



**కాకినాడ బ్యూరో, 07 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సామర్లకోట పట్టణం బలుసుల పేట, పరిధిలో నమోదు అవుతున్న పచ్చ కామెర్లు వ్యాధి పట్ల ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి, డా. కె. అనిత ఒక ప్రకటనలో తెలియజేసారు. ఆదేవిధంగా సమీప పరిధిలో ఉన్న సామజిక ఆరోగ్య కేంద్రం నందు 24 ఇ 7 వైద్యులు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఎవరైనా జ్వరము, విరోచనాలు, వాంతులు, ఆకలి తగ్గుట, కడుపునొప్పి, అలసట, మొదలైన లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవాలని సూచించారు.ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఆధ్వర్యంలో డివిజినల్ ఆఫీసర్ పెద్దాపురం, డిస్ట్రిక సర్వేలన్స్ ఆఫీసర్ మరియు డిస్ట్రిక్ట్ ఎపిడమిక్ టీం సిహెచ్సీ, సామర్లకోట నందు చికిత్స పొందుతున్న రోగులను సందర్శించి తగిన సూచనలు సలహాలు ఇచ్చి వ్యాధి రావడానికి గల కారణాలను విచారించడమైనది. అలాగే కాకినాడ ఆర్ఎంసీ నుండి రాపిడ్ రెస్పాన్స్ టీం కూడా సిహెచ్సి, సామర్లకోట మరియు బలుసుల పేట ఏరియాను సందర్శించి నీటి నమూనాలను మరియు రక్తపు నమూనాలను సేకరించడం జరిగినది. తదుపరి సామర్లకోట మునిసిపల్ కమిషనర్ ను కూడా వ్యాధి ప్రభావిత ప్రాంతంలో నీటి నమూనా ఫలితాలు వచ్చే వరకు ప్రత్యామ్నయ సురక్షిత మంచి నీటిని వాటర్ ట్యాంక్ లు ద్వారా సరఫరా చెయ్యాలని సూచించడమైనది. అదేవిధంగా సామర్లకోట పట్టణంలో టాం-టాం మరియు ఇతర ప్రచార సాధనాలు ద్వారా ప్రజలందరికీ ఈ క్రింది సూచనలు చెయ్యాలని తెలియజేయడమైనది. కాచిచల్లార్చిన నీటిని త్రాగవలెను.నిల్వ ఉన్న ఆహార పదార్థాలు భుజించరాదు. పరిసరాల పరిశుభ్రత పాటించ వలెను. తినే ముందు మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో కడుగుకొనవలెను.

6

# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

## పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం

## మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**హైదరాబాద్ :** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎఐ÷ు ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ. 18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ. 5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ. 49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ. 980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# 15 రాష్టాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు

## మొత్తం 49 మంది నిందితుల అరెస్టు

**హైదరాబాద్,ఆగస్ట్7 :** సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ సహా 15 రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ ముఠాల గుట్టురట్టు చేశారు. మొత్తం 49 మంది నిందితులను అరెస్టు చేసి, రికవరీ చేసిన రూ. 98.89లక్షల డబ్బును బాధితులకు రిఫండ్ చేశారు. జులైలో 70 సైబర్ క్రైమ్ సంబంధిత ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రేడింగ్ మోసాలే అత్యధికంగా జరిగాయని.. ఆ కేసుల్లో 29 మందిని అరెస్టు చేశామని వివరించారు. మొత్తంగా 25 డెబిట్‌కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జోనల్ సైబర్ సెల్స్ ద్వారా 298 కేసులు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. 128 నకిలీ సోషల్‌మీడియా ప్రొ÷ళ్లు, 36 నకిలీ యాడ్స్‌ను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవేనని పోలీసులు స్పష్టం చేశారు. వాటిని నమ్మొద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

## కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

**న్యూఢిల్లీ,ఆగస్ట్7 :** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్..

## ఏఐ సేవలకు మరింత ఊతం

**హైదరాబాద్,ఆగస్ట్7 :** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరో-వాటర్ కూలింగ్" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

అధికారమే లక్ష్యంగా బీజేపీ రూట్మ్యాప్

పంద్రాగస్టు తర్వాత పార్టీ కోర్ కమిటీ సమావేశం

గ్రేటర్ బరిలో ఒంటరిగానే పోటీకి నిర్ణయం

పార్టీ రాష్ట్రాధ్యక్షుడు, ఎంపీలతో ఢిల్లీలో నబీన్ భేటీ

విభేదాలు వీడి ఐక్యంగా అడుగేయాలని ఉద్బోధ

చిన్న చిన్న విభేదాలుంటే కూర్చోబెట్టి మాట్లాడి

పరిష్కరిస్తున్నాం: రాంచందర్ రావు



**హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 7 :** రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగాలని కమలం పార్టీ నిర్ణయించుకుంది. ఏ పార్టీ తోనూ పొత్తు అవసరం లేదని ప్రకటిం చింది. ఇందుకు అనుగుణంగా కేడర్ను సన్నద్ధం చేయాలని రాష్ట్ర పార్టీ నాయక త్వానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక చేయాల్సిన పోరాటాలపై రోడ్మ్యాప్ను రూపొందిం చుకోవాలని సూచించారు. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచం దర్రావు, రాష్ట్ర పార్టీ ఇన్చార్జి అభయ్ పాటిల్, కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్ సహా తెలంగా ణలోని పార్టీ ఎంపీలతో ఆయన గంటన్నరపాటు సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలంటే బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని రాష్ట్ర నేత లకు ఆయన ఉద్బోధించారు. బెంగాల్లో కేవలం పదే ళ్లలోనే ప్రభుత్వాన్ని నెలకొల్పామని.. చాలా ఏళుగా పార్టీ బలంగా ఉన్న తెలంగాణలో అధికారంలోకి రాక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొన్నారు. బెంగాల్ తర్వాత పార్టీకి తదుపరి లక్ష్యం తెలంగాణే నని, రాష్ట్రంలో అధికారం ॥ చేజిక్కించుకోవడం పైనేతాము దృష్టి పెట్టినట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో నేతల మధ్య సమన్వయం, ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్న ద్ధత తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. పార్టీని క్షేత్రస్థాయిలో విస్తృతం చేసే దిశగా రూట్ మ్యాప్ రూపొందించారు. తదనుగుణంగా పంద్రాగస్టు తర్వాత పార్టీ కోర్ కమిటీ ప్రత్యేకంగా భేటీ కానుంది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే హైదరాబా ద్-రంగారెడ్డి-మహబూబ్న గర్, వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. గత జూన్లో రాష్ట్రంలో తాను పర్యటించిన అనంతరం, నిర్వహించిన కార్యక్రమాలపై నబిన్ ఆరాతీ శారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలు కోసం ప్రభు త్వంపై ఒత్తిడి పెంచాలని నిర్దేశించారు. రాష్ట్రంలో 30 శాతానికి పైగా మండలాల్లో పార్టీ పనితీరు బాగో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల స్థాయిలో కమిటీలను క్రియాశీలం చేయాలని సూచించారు.

### నేతలమధ్య విభేదాలు లేవు: రాంచందర్రావు

తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఉంటే కూర్చొబెట్టి పరిష్కరి స్తున్నామని బీజేపీ రాష్ట్ర ఆధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. భవిష్యత్తులో భేదాభిప్రాయాలు వచ్చినా వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తు పెటుకోబోమని, భవి ష్యత్తులో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలి పారు. జనసేన, ఇతర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అంశంపై జాతీయ స్థాయిలో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బలమైన పోరాటం చేయాలని, ముఖ్యంగా ఫీజు రీయంబర్స్ మెంట్, అవినీతి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నబిన్ తమకు సూచించినట్లు పేర్కొన్నారు.

### అధికారంలోకి తేవడమే లక్ష్యం: ఈటల

తెలంగాణలో బీజేపీని గెలిపించాలన్నదే పార్టీ ఎంపీల లక్ష్యమని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొ న్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తెలంగా ణను కాపాడాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో వర్షం. ఫలితంగా ట్రాఫిక్ జామ్ కారణంగా నబిన్‌తో పార్టీ ఎంపీల సమావేశానికి ఆయన కాస్త ఆలస్యంగా వచ్చారు. రాంచందర్రావు మీడియాతో మాట్లాడి వెళ్లిపోయాక ఈటల మాట్లాడారు.


# తెలంగాణ ప్రాజెక్టులపై మళ్లీ సమీక్ష మర్మమేంది?

జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం సరికాదు

వివాదాస్పద అంశాలను తొలగించండి

సమ్మక్కసాగర్‌కు పెండింగ్ అనుమతులివ్వాలి

కేంద్ర జలశక్తి మంత్రి, సెక్రటరీకి హరీశ్ లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 7 :** కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు లభించిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులపై పునఃసమీక్షించే అంశాన్ని గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) 18వ సమావేశం ఎజెండాలో చేర్చడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తంచేశారు. శుక్రవారం కేంద్ర జల్‌శక్తి మంత్రి, సెక్రటరీకి లేఖ రాశారు. సీడబ్ల్యూసీ, జల్‌శక్తి శాఖల అనుమతులు పొందిన ప్రాజెక్టులపై కిందిస్థాయి బోర్డు సమీక్షించడం సరికాదని స్పష్టంచేశారు. ఏపీ పునర్విభజన చట్టం-2014, సెక్షన్ 85 కింద జోక్యం చేసుకొని తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. జీఆర్ఎంబీ 18వ మీటింగ్ ఎజెండాలో చేర్చిన 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను తక్షణమే వెనక్కితీసుకొనేలా బోర్డును ఆదేశించాలని లేఖలో కోరారు. 'జీఆర్ఎంబీ తెలంగాణ ప్రాజెక్టులపై పునఃసమీక్షించాలని నిర్ణయించడం కేవలం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలు కావు.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, అత్యున్నత సంస్థల అధికారులు, వాటి విశ్వసనీయతకు సంబంధించిన సున్నితవిషయం' అని స్పష్టంచేశారు.

### క్షుణ్ణంగా పరిశీలించాకే టీఏసీ ఆమోదం

నీటిపారుదల పథకాలకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజినీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను సీడబ్ల్యూసీ, జల్‌శక్తి మంత్రిత్వశాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ఆమోదం తెలిపిందని హరీశ్ గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత సంస్థలు చట్టబద్ధంగా అనుమతులు ఇచ్చిన తర్వాత ఆ నిర్ణయాలను మళ్లీ సమీక్షించే, రద్దు చేసే అధికారం జీఆర్ఎంబీ సంస్థకు ఏమాత్రం ఉండబోదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలపై రివ్యూ చేసేందుకు జీఆర్ఎంబీకి అవకాశం ఇస్తే, అది కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యతను తగ్గించడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణలోని కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరెడ్డి, ముక్తేశ్వరం, చనాక-కొరాట, మోడికుంటవాగు, కడెం-గూడెం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ లాంటి కీలక ప్రాజెక్టులకు సుదీర్ఘ కసరత్తు, పరిశీలన ప్రక్రియ తర్వాతే క్లియరెన్స్‌లు లభించాయని పునరుద్ఘాటించారు. సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టులను లోతుగా పరిశీలించిందని, కానీ పరోక్ష పద్ధతుల ద్వారా వీటిని తిరిగి తెరపైకి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

### అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోనూ రికార్డు

గతంలో కేంద్రం నిర్వహించిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ ప్రాజెక్టుల క్లియరెన్స్‌కు సంబంధించిన అంశాలు స్పష్టమయ్యాయని హరీశ్ గుర్తుచేశారు. బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల అవసరాలు తీరిన తర్వాతే ఇంటర్ బేసిన్‌కు మళ్లించాలని రికార్డు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. సీడబ్ల్యూసీ నుంచి ఇప్పటికే హైడ్రోలాజికల్ అనుమతులు పొందిన సమ్మక్క సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు మిగిలిన చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కేంద్రం అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టులపై మళ్లీ పునఃసమీక్షించే అవకాశం ఇస్తే భవిష్యత్తులో జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీ ఇచ్చే ప్రతి అనుమతిపై అనిశ్చితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో తెలంగాణలో సాగునీటి అభివృద్ధి కుంటుపడటంతో పాటు, కోట్లాది మంది రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని స్పష్టంచేశారు. తాగునీటి భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించి జీఆర్ఎంబీ ఎజెండాలోని అంశాలను ఉపసంహరించుకొనేలా ఆదేశిలివ్వాలని విజ్ఞప్తిచేశారు. సమ్మక్క సాగర్, ఇతర పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని కోరారు. కేంద్రం సకాలంలో జోక్యం చేసుకొని తెలంగాణ నీటి హక్కులను కాపాడుతుందని విశ్వసిస్తున్నట్టు పేర్కొన్నారు.

# యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ

మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'

పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ

రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన

**న్యూఢిల్లీ,ఆగస్ట్7 :** బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే దీనికో సం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంద్రాల (ఫంగస్) లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర్'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్-హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక్ సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంద్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందిం చారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక్ లెదర్‌కు ప్రత్యా మ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు. ఫంగీ లెదర్ తయారీ తర్వాత మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కూడా పూర్తిగా రీసైకిల్ చేయడం వల్ల వ్యర్థాలు దాదాపు ఉండవు. ఈ వినూత్న ఉత్పత్తి తయారీకి వరి పొట్టు, చెక్క ముక్కలు వంటి వ్యవసాయ వ్యర్థాలను వినియోగిస్తారు. ముందుగా వాటిని క్రిమిరహితం చేసి, ప్రయోగశాలలో తయారుచేసిన ప్రత్యేక పోషక మాధ్యమంతో కలుపుతారు. అనంతరం నియంత్రిత ఉష్ణోగ్రత, తేమ ఉన్న గదిలో పెద్ద ట్రేలలో ఉంచుతారు. కొన్ని రోజుల తర్వాత మైసీలియం క్రమంగా పెరిగి మొత్తం ఉపరితలాన్ని ఆక్రమిస్తుంది. సుమారు 20 రోజుల తర్వాత ఇది దట్టమైన పీచు నిర్మాణంగా మారుతుంది. దాదాపు 30 రోజుల తర్వాత ఆ పొరను సేకరించి, ప్రత్యేక ప్రక్రియల ద్వారా శుద్ధి చేసి, సాగే గుణం కలిగిన తోలుగా మారుస్తారు. చివరగా దీనిని అవసరానికి అనుగుణంగా రంగులు, ఫినిషింగ్ ఇచ్చి మార్కెట్‌కు సిద్ధం చేస్తారు.

# భారత స్పిన్నర్లు రాణించినా..

## తొలిరోజు లంక ఎలెవన్ భారీ స్కోరు

శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టు ఆడుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్ తొలిరోజు ఆట ముగిసింది. భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ రాణించినప్పటికీ, శ్రీలంక క్రికెట్ ఎలెవన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 363 పరుగుల భారీ స్కోరు సాధించింది. శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టుకు ఓపెనర్లు నిషాన్ మదుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి భారత పేసర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలపై ఆధిపత్యం చెలాయించారు. అయితే, మదుష్క రనౌట్‌గా వెనుదిరగడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. భోజన విరామం తర్వాత భారత స్పిన్నర్లు పుంజుకున్నారు. ఐపీఎల్ 2026 తర్వాత తొలిసారి బరిలోకి దిగిన రవీంద్ర జడేజా (2/64) కీలక వికెట్లు పడగొట్టాడు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ (2/48), కుల్దీప్ యాదవ్ (2/76) కూడా తమ స్పిన్‌తో లంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ఫ్లాట్‌గా ఉన్న పిచ్‌పై స్పిన్నర్లు టర్న్ రాబట్టడంతో శ్రీలంక మిడిల్ ఆర్డర్ తడబడింది. లంక జట్టులో కెప్టెన్ సోనాల్ దినూష (52) కూడా హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశాడు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా దూరమవడంతో ఈ మ్యాచ్‌కు కేఎల్ రాహుల్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత బౌలర్లకు ఇది మంచి ప్రాక్టీస్‌గా ఉపయోగపడినప్పటికీ, తొలిరోజే 360కి పైగా పరుగులు ఇవ్వడం ఆందోళన కలిగించే అంశం.




## అభిమానులకు శ్రీలంక బోర్డు బంపరాఫర్


క్రికెట్ అభిమానులకు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బోర్డు తీపి కబురు అందించింది. భారత్‌తో స్వదేశంలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను వీక్షించేందుకు స్టేడియంలోకి అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సిరీస్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025--27లో భాగంగా జరగనుంది. తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలె అంతర్జాతీయ స్టేడియంలో, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనున్నాయి. ప్రేక్షకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్టేడియంలోకి ప్రవేశించేందుకు ప్రత్యేక ద్వారాలను కేటాయించారు. గాలె స్టేడియంలో గేట్ నెంబర్ 4 ద్వారా, కొలంబో స్టేడియంలో గేట్లు నెంబర్లు 3, 4, 5, 7 ద్వారా ప్రేక్షకులను అనుమతిస్తారు. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో భారత్ 5వ స్థానంలో ఉండగా, శ్రీలంక 6వ స్థానంలో ఉంది. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో శ్రీలంక పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు, యువ క్రీడాకారులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మ్యాచ్‌లకు హాజరు కావాలని శ్రీలంక క్రికెట్ బోర్డు పిలుపునిచ్చింది.

## కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టిన అజింక్యా రహానే



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్యా రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే, యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో అడుగుపెట్టాడు. ఈ లీగ్ తొలి ఎడిషన్ కోసం అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ ఫ్రాంచైజీకి కీలక ఆటగాడిగా రహానే సంతకం చేశాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం నేడు అధికారికంగా వెల్లడించింది. ఐసీసీ ఆమోదం పొందిన యూరప్‌లోని మొట్టమొదటి టీ20 లీగ్ ఇదే కావడం విశేషం. ఈ లీగ్ తొలి సీజన్ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన ఆరు ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి. భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడిన రహానేకు అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు ఆడి, ఇటీవలి సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. రహానే చేరికపై అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వా హర్షం వ్యక్తం చేశాడు. రహానే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వినయం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు. యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం, ఒక విజయవంతమైన ఫ్రాంచైజీని నిర్మించడంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని రహానే పేర్కొన్నాడు. ఈ కొత్త లీగ్‌కు రహానే వంటి స్టార్ ఆటగాడి రాక మంచి బూస్ట్ ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ గుడ్ బై!



ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టు వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే అతను జట్టు నుంచి తప్పుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. టీమ్‌లో కొనసాగలేనని సమాచారమిచ్చినట్లు వార్తలు వచ్చాయి. హార్దిక్ పాండ్యాను ఇతర జట్టుకు ట్రేడింగ్ చేసి తమకు కావాల్సిన ఆటగాళ్లను తీసుకోవాలనే యోచనలో ముంబై ఇండియన్స్ ఉంది. ఇప్పటికే సీఎస్‌కే, కేకేఆర్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఇలా ఉండగానే సూర్యకుమార్ యాదవ్ ట్రేడ్ డీల్ వార్తలు కూడా తెరపైకి వచ్చాయి. ముంబై ఇండియన్స్ జట్టులో కొనసాగేందుకు సూర్యకుమార్ యాదవ్ సుముఖంగా లేడని, అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. అయితే లక్నో జట్టులో చేరేందుకు సూర్య విముఖత చూపినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ నుంచి అతని నిష్క్రమణ ఖాయమైనప్పటికీ.. అతను ఏ జట్టులో చేరుతాడనేది ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంలో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ తీవ్రంగా నిరాశపర్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య.. 2026 సీజన్‌లో మాత్రం 13 మ్యాచ్‌ల్లో 2 హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. అతని పేలవ ఫామ్ ముంబై విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే సూర్యతో పాటు పలువురు కీలక ఆటగాళ్లను తొలగించాలని ముంబై మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. హార్దిక్ పాండ్యాను కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ట్రేడ్ చేసేందుకు చర్చలు జరుగుతుండగా.. సూర్య ట్రేడ్ డీల్‌పై క్లారిటీ లేదు. అయితే సూర్య నిష్క్రమణపై ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో సూర్య.. టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో కూడా చోటు కోల్పోయాడు.



## సచిన్ బ్రాండ్ వాల్యూ రూ.1,200 కోట్లు

### రిటైరైనా తగ్గని 'మాస్టర్' క్రేజ్!

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆటకు వీడ్కోలు పలికి ఏళ్లు గడుస్తున్నా, అతని క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. బ్రాండ్ విలువలో ఇప్పటికీ దేశంలోని టాప్ సెలబ్రిటీలతో పోటీ పడుతున్నాడు. తాజాగా విడుదలైన 'క్రోల్ ఇండియా సెలబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్ 2025' నివేదిక ప్రకారం సచిన్ బ్రాండ్ విలువ 125.9 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 1,201 కోట్లు) చేరింది. దీంతో అతడు దేశంలోనే టాప్-5లో స్థానం సంపాదించాడు. విశేషమేమిటంటే.. ఈ జాబితాలో టాప్-10లో నిలిచిన ఏకైక రిటైర్డ్ క్రీడాకారుడు సచిన్ కావడం. ఏటా అతని బ్రాండ్ విలువ పెరుగుతూనే ఉండటం గమనార్హం. సచిన్‌పై ప్రజల్లో ఉన్న అపారమైన నమ్మకం, విశ్వసనీయత, తరగని కీర్తిప్రతిష్ఠలే ఈ స్థాయి బ్రాండ్ విలువకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందుకే వివిధ రంగాలకు చెందిన ప్రముఖ బ్రాండ్‌లు ఇప్పటికీ ఆయనతో ఒప్పందాలు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. 'గాడ్ ఆఫ్ క్రికెట్'గా, 'మాస్టర్ బ్లాస్టర్'గా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న సచిన్‌కు ఈ స్థాయి బ్రాండ్ ఇమేజ్ రావడానికి మైదానంలో ఆయన సృష్టించిన అసాధారణ రికార్డులే పునాది. తన తరంలో అత్యంత సంపూర్ణమైన బ్యాటర్‌గా గుర్తింపు పొందిన సచిన్, అంతర్జాతీయ క్రికెట్‌లో 34,357 పరుగులు చేసి, అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా చరిత్రలో నిలిచిపోయాడు. టెస్ట్ క్రికెట్‌లో అతని పేరిట ఎన్నో రికార్డులు పదిలంగా ఉన్నాయి. అత్యధికంగా 200 టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఏకైక ఆటగాడు సచిన్. ఈ ఫార్మాట్‌లో 15,921 పరుగులు, 51 శతకాలు సాధించాడు. కేవలం 300 ఇన్నింగ్స్‌లలోనే 15,000 పరుగుల మైలురాయిని అత్యంత వేగంగా అందుకున్న ఘనత కూడా అతనిదే. ఇక, వన్డే ఫార్మాట్‌లోనూ సచిన్ రికార్డుల మోత మోగించాడు. 22 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో (1998) అత్యధికంగా 1,894 పరుగులు, 9 సెంచరీలు చేసిన రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. వన్డేల్లో 145 అర్ధశతకాలు, 2,016 ఫోర్లతో పాటు అత్యంత వేగంగా 18,000 పరుగులు (440 ఇన్నింగ్స్‌లు) పూర్తి చేసుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఈ అసామాన్య ప్రతిభే అతడిని బ్రాండ్ ప్రపంచంలోనూ తిరుగులేని శక్తిగా నిలబెట్టింది.

## అదరగొట్టిన ప్రజ్ఞానంద.. సెయింట్ లూయిస్ టైటిల్ కైవసం

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద మరోసారి తన సత్తా చాటాడు. అమెరికాలో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. ఒక రౌండ్ మిగిలి ఉండగానే టైటిల్‌ను ఖాయం చేసుకున్నాడు. చివరి ప్రత్యక్ష పోరులో జవోఖిర్ సిందరోవ్‌తో ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. ఈ ఫలితంతో టైటిల్ అతని సొంతమైంది. మొత్తం 35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. సిందరోవ్ 22 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకున్నాడు. వెస్లీ సో 20.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. లెవాన్ అరోనియన్ 19 పాయింట్లతో నాలుగో స్థానం సాధించాడు. ఈ విజయంతో ప్రజ్ఞానందకు 50 వేల అమెరికన్ డాలర్ల నగదు బహుమతి లభించింది. అలాగే గ్రాండ్ చెస్ టూర్‌లో 13 పాయింట్లు కూడా ఖాతాలో చేరాయి. ప్లేఆఫ్ అవసరం లేకుండానే నేరుగా టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో గ్రాండ్ చెస్ టూర్ మొత్తం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఫాబియానో కరువానా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జులై 31 నుంచి ఆగస్టు 7 వరకు జరిగిన ఈ టోర్నీలో ప్రపంచంలోని 10 మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఐదు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రజ్ఞానంద ఆరంభం నుంచే ఆధిక్యాన్ని కొనసాగించాడు. చివరి వరకు సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఆగిపోయాడు. ఈ ఏడాది జూన్‌లో నార్వే చెస్ టోర్నమెంట్‌లోనూ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఆ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను గెలిచిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు.



# బాలీవుడ్ నంబర్ 1 క్వీన్‌గా అలియా భట్!

సినీ ఇండస్ట్రీలో తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అలియా భట్, ఇప్పుడు ఇండియాలో టాప్ మహిళా సెలబ్రిటీల్లో ఒకరిగా నిలిచింది. ప్రముఖ సంస్థ క్రోల్ విడుదల చేసిన బ్రాండ్ వేల్యూ నివేదికలో దీపికా పదుకొణె, రష్మిక మందన్న వంటి అగ్ర కథానాయికలను వెనక్కి నెట్టి అలియా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. వరుస హిట్లు, అంతర్జాతీయ బ్రాండ్ల రాయబారంతో ఆమె ఈ అరుదైన ఘనతను సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. ప్రముఖ ఆర్థిక అధ్యయన సంస్థ 'క్రోల్' ఇటీవల విడుదల చేసిన సెలబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్ రిపోర్ట్‌లో అలియా భట్ మొదటి స్థానంలో నిలిచారు. ఇక భారతదేశంలో ఉన్న మిగతా హీరోయిన్లందరి కంటే ఆమె బ్రాండ్ విలువ అత్యధికంగా నమోదు కావడం విశేషం. కేవలం నటనతోనే కాకుండా, బిజినెస్ రంగాన్ని కూడా శాసిస్తూ ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు. ఈ జాబితాలో అలియా తర్వాతి స్థానంలో దీపికా పదుకొణె రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే నేషనల్ క్రష్ రష్మిక మందన్న మూడో స్థానాన్ని కైవసం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక సీనియర్ నటి కరీనా కపూర్ ఖాన్, గ్లామరస్ బ్యూటీ కియారా అద్వానీ కూడా టాప్ రేసులో నిలిచి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. అలియా భట్ విజయంలో ఆమె సినిమాలతో పాటు ఇతర వ్యాపారాలు కూడా కీలక పాత్ర పోషించాయి. అంతర్జాతీయ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడంతో పాటు, 'ఎడ్-ఎ-మమ్మ' అనే పిల్లల దుస్తుల బ్రాండ్‌ను విజయవంతంగా నడుపుతున్నారు. ఇక దీనివల్ల ప్రకటనల ప్రపంచంలో ఆమె అత్యంత డిమాండ్ ఉన్న తారగా మారారు.



# 'కొరియన్ కనకరాజు'కు అదిరిపోయే ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా 'కొరియన్ కనకరాజు'కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.




# ఓటీటీ లోకి జన నాయగన్

తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు.



# 'వారణాసి' వీడియో లీక్..



దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వారణాసి సినిమాకు లీకులు బెడద ఎక్కువగానే ఉంటున్నది. ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేసి.. పకడ్బందీగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పటికీ.. ఈ సినిమా కోసం షూట్ చేస్తున్న కీలక సన్నివేశాలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టు చేసి లీక్ చేస్తున్నారు. ఈ లీకుల బెడదతో చిత్ర యూనిట్ ఆందోళనకు గురి అవుతున్నట్టు సమాచారం. గతంలో కూడా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఫోటోలు, వీడియోలు మీడియాలో లీక్ అయ్యాయి. అయితే తాజాగా 20 సెకన్ల నిడివి ఉన్న ఓ సన్నివేశాన్ని కొందరు లీక్ చేయడంతో ఆ విషయం సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారింది. దర్శకుడు రాజమౌళి తన సినిమా షూటింగ్ స్పాట్‌ను అన్ని రకాలుగా దిగ్బంధం చేస్తారు. లోపలి విషయాలు బయటకు పొక్కకుండా సాంకేతికంగా చాలా జాగ్రత్తలు తీసుకొంటారు. సినిమా కోసం పనిచేసే ప్రతీ ఒక్కరి నుంచి లీక్‌లు చేయకుండా అగ్రిమెంట్స్ రాయించుకొంటారు. ఎవ్వరైనా విషయాన్ని బయటకు లీక్ చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడమనే పాయింట్‌తో కూడిన అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా చేయించుకొంటారు. అయినా ఆయన షూటింగ్‌లకు సంబంధించిన లీకుల బెడద తప్పకపోవడం ఆందోళనకరంగా మారింది. వారణాసి సినిమా షూటింగును ఒడిశాలోని ఓ మారుమూల ప్రాంతంలో చిత్రీకరించారు. అయితే కెమెరాకు అందని దూరంలో ఉన్న సన్నివేశాలను షూట్ చేసి వాటిని కొందరు లీక్ చేశారు. ఇక ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ సమయంలో రామోజీ ఫిలిం సిటీలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి దొంగచాటుగా షూట్ చేసి లీక్ చేశారు. గ్లింప్స్‌ను అధికారికంగా రిలీజ్ చేయడానికి ముందే అది సోషల్ మీడియాలో విడుదల కావడం షాకిచ్చింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన 20 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నదనే సమాచారం మరోసారి భారీ షాక్‌కు గురి చేసింది. కొందరు ఈ క్లిప్పింగ్ గురించి సోషల్ మీడియాలో మాట్లాడుతూ.. రక్తంతో రాసిన కథ. దానిని సిరాతో ముందుకు తీసుకెళ్లలేం. ముందుకు వెళ్లాలంటే రక్తమే అడుగుతుంది అనే డైలాగ్స్ ఉన్నట్టు నెటిజన్లు షేర్ చేసుకొంటున్నారు. మహేష్ బాబు షర్ట్ లేకుండా.. రక్తంలో తడిచిన వీడియో ఫ్యాన్స్‌కు క్రేజీగా మారినట్టు తెలుస్తున్నది. అయితే ఈ వీడియోను ఎక్కువగా ప్రచారం జరుగకుండా తొలగించే ప్రయత్నాలు వేగవంతం చేసినట్టు తెలిసింది.

# చిక్ కేఫే స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!

బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం. ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది. ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది.



PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342